

మంత్రి అజారుద్దీన్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు మసూద్, అక్బర్ అలీ తదితరులు

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● మంత్రి అజారుద్దీన్

ముషీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి అజారుద్దీన్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ భోలక్‌పూర్ కమిటీ సభ్యులు మంత్రిని సన్మానించారు. మైనార్టీలు అధికంగా నివస్తున్న ప్రాంతాల్లో అభివృద్ధి పనుల చేపట్టడంతోపాటు అర్హులైన వారికి ఆర్థిక రుణాలు అందజేసేలా కృషి చేయాలని అజారుద్దీన్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్, అక్బర్ అలీ, డివిజన్ అధ్యక్షుడు జమీరుద్దీన్, నాయకుడు అల్లా ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎడ్ల హరిబాబు యాదవ్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

యాదవులు హక్కులను సాధించుకోవాలి

ముషీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాదవులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని రాష్ట్ర యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ అన్నారు. సోమవారం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదరు వేడుకల విజయోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న యాదవులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహకారం అందించాలని, సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం నాయకులు, యాదవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఆక్రోశ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జి. సంతోష్‌కుమార్, బీసీ సంఘాల నాయకులు

15న కామారెడ్డిలో బీసీ ఆక్రోశ సభ

ముషీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునేందుకు ఈ నెల 15న కామారెడ్డిలోని సత్యాకన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే బీసీ ఆక్రోశ బహిరంగ సభను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు జి. సంతోష్‌కుమార్ కోరారు. సోమవారం ముషీరాబాద్‌లోని ధర్మసమాజ్ పార్టీ కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు అమలయ్యేలా బీసీ ఎంపీలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలు బీసీ కులసంఘాల నాయకులు శ్రీనివాస్ గౌడ్, సాయియాదవ్, సాయి కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ధార్మికగ్రంథ రచయిత కామేశ్వరరావును సన్మానిస్తున్న అతిథులు

మధురంగా ఆపాత మధురగీతాల సంగీత కార్యక్రమం

చిక్కడపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధార్మిక, సేవాసంస్థ చేయూత ఫౌండేషన్ సౌజన్యంతో రాంకీ మెలోడీస్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన ఆపాత మధురగీతాల సంగీత కార్యక్రమం మధురంగా సాగింది. వైఎస్ రామకృష్ణ నిర్వహణలో హాయి హాయిగా ఆమని సాగే శీర్షికతో సాగిన కార్యక్రమంలో పలువురు గాయనీగాయకులు గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త, ధార్మిక గ్రంథరచయిత డా. కేతరాజు పూర్ణిమ కామేశ్వరరావును సన్మానించారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, ప్రముఖ పాత్రికేయుడు గుండు వల్లీశ్వర్, సివిల్ ఇంజనీర్ సత్యనారాయణ, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న రఘుబాబు, రమ్యశ్రీ

తండ్రీకుమార్తెలకు పురస్కారాలు

రాంనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలికులు రఘుబాబు, ఆయన కుమార్తె డాక్టర్ జి.రమ్యశ్రీకి అరుదైన గౌరవం దక్కింది. ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో జరిగిన 41వ మ్యాజిక్ ఫెస్టివల్‌లో రఘుబాబును విశిష్ట ఇంద్రజాలకుడు అవార్డుతో, ఆయన కుమార్తె డాక్టర్ రమ్యశ్రీని జాదురత్న అవార్డుతో సత్కరించారు. తండ్రి, కుమార్తెలు అవార్డు సాధించడంతో నగర సీనియర్ మెజీషియన్ డాక్టర్ బి.ఎస్.ఎస్.కుమార్, ఇతర మెజీషియన్‌లు అభినందించారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు : ఎమ్మెన్



ముషీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌కే సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు దొంగ ఓట్లు నమోదు చేయించి ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ స్థానిక ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రెండేళ్లలో రాష్ట్రంలో సాధించిన ప్రగతి ఏమీలేదన్నారు.



అందెశ్రీకి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నిరుద్యోగులు

అందెశ్రీకి నివాళి

చిక్కడపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జయజయహే తెలంగాణ గీత రచయిత అందెశ్రీకి నిరుద్యోగులు, నిరుద్యోగ జేఏసీ నేతలు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీ చైర్మన్ కేసీ రెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ తెలంగాణ గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని చాటి చెప్పిన కవి అందెశ్రీ అని అన్నారు. మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడూ పాటలో మానవీయ విలువలు నేటి సమాజానికి తెలియపర్చారన్నారు. నిరుద్యోగ జేఏసీ నేతలు శంకర్‌నాయక్, కయ్య వెంకటేష్, మిద్దె సురేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల గుండెల్లో అందెశ్రీ పాటలు నిలిచి ఉంటాయన్నారు. అందెశ్రీ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటు అని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సలీమ్, సంపత్, రమేష్, గణేశ్, దామోదర్, కుమార్, బాలకోటి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గానసభ అధ్యక్షుడి సంతాపం

ప్రముఖ కవి అందెశ్రీ ఆకస్మిక మృతిపట్ల త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీ భౌతికంగా మన మధ్య లేకపోయినా వేగుచుక్కలా ఆకాశంలో శాశ్వతంగా వెలుగుతూ ఉంటారన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సిటీ సెంట్రల్ లైబ్రరీతో అనుబంధం



అందెశ్రీతో సిటీ సెంట్రల్ లైబ్రరీ ఉద్యోగులు

తెలంగాణ జాతీయ గీత రచయిత అందెశ్రీకి చిక్కడపల్లి లోని సిటీ సెంట్రల్ లైబ్రరీతో అనుబంధం ఉంది. తరచుగా ఆయన లైబ్రరీకి వచ్చి సిబ్బందిని, చైర్మన్, కార్యదర్శిని కలిసేవారు. పుస్తకాలు చదువుకునేవారు. లైబ్రరీ కార్యదర్శి పి. పద్మజ మాట్లాడుతూ అందెశ్రీ తాను రాసిన పుస్తకాలను ఇచ్చేవారని, లైబ్రరీ ఆవరణలో మాత మందిరాన్ని సందర్శించేవారన్నారు. కుటుంబసభ్యులకు లైబ్రరీ సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

తెలంగాణ సమాజానికి తీరని లోటు



అంబర్‌పేట: అందెశ్రీ మరణం తెలంగాణ సాహిత్యానికి, సమాజానికి తీరని లోటు అని తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్సన్ అన్నారు.

తెలుగు సాహిత్యం విలువైన సాహితీకారుడిని కోల్పోయింది



తెలుగు సాహిత్యం విలువైన సాహితీకారుడిని కోల్పోయిందని తెలుగు భాషా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బడేసాబ్ పేర్కొన్నారు. తెలుగు భాషలో తనదైన శైలిలో రచనలు చేస్తూ ప్రజల అభిమానం పొందిన ప్రముఖ కవి, తెలుగు సాహిత్య రచనలో తనకంటూ ప్రత్యేకతను ఏర్పరచుకున్న అందెశ్రీ తెలుగుసాహిత్యంలో చిరంజీవి అని అన్నారు.

ప్రజల హృదయాలను గెలుచుకున్నారు

బర్కత్‌పుర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అందెశ్రీ మరణం సమాజానికి తీరని లోటు అని పొలిటీషియన్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ ఇంద్రపల్లి అన్నారు. ఆయన మరణాన్ని కవులు, కళాకారులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. అనేక విషయాలలో ముక్కు సూటిగా చెప్పే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అందెశ్రీ అని కొనియాడారు.

గ్రామీణ ప్రాంత సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసి ప్రజల హృదయాలను గెలుచుకున్నారని అన్నారు. అందెశ్రీ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

సాహితీ లోకానికి తీరని లోటు

రాంనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, గాయకులు అందెశ్రీ మృతి సాహితీలోకానికి తీరని లోటు అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. సోమవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఎన్నో పాటలు రాసి ప్రజా చైతన్యం కల్పించిన వ్యక్తి అందెశ్రీ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప వ్యక్తి

- తెలంగాణ సాహిత్య రంగానికి అందెశ్రీ అందించిన సేవలు మరువలేనివని, 3 వేలకుపైగా కవితలు, అనేక పాటలు రాసిన గొప్పవ్యక్తి అని సర్వజన వికాస్ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు.
- తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అందెశ్రీ కీలకపాత్ర పోషించారని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ అన్నారు. సోమవారం అందెశ్రీ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు.



అందెశ్రీ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్

అందెశ్రీ పాటలు చరిత్రలో నిలిచిపోతాయి

కవాడిగూడ: అందెశ్రీ మృతి రాష్ట్ర ప్రజలకు తీరని లోటని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన పోరాటం, పాడిన పాటలు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

'సీఎస్‌సీ' చేస్తున్న ఆరోగ్య పరీక్షలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నేత

రాంనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) చేస్తున్న ఆరోగ్య పరీక్షలను రద్దు చేయాలని, వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, దేవేందర్‌రెడ్డి (ఏఐటీయూసీ), సాంబశివుడు (పీయూసీఐ), జి.అనురాధ (ఐఎఫ్‌టీయూ), చంద్రమౌళి (స్ఫూర్తి కార్మిక సంఘం), సాయికుమార్ తదితరులు మాట్లాడారు. జీవో 12ను సవరించి ప్రభుత్వమే వెల్ఫేర్‌బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమం పథకాలు అందించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, గుర్తింపు లేని ప్రైవేట్ బీమా కంపెనీలకు ఇచ్చిన రూ. 346 కోట్లను తిరిగి సంక్షేమ బోర్డులో జమ చేయాలని, 1996 కేంద్ర చట్టం నిబంధనలను ధిక్కరించిన అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



డాక్టర్ లంక వెంకటసుబ్రహ్మణ్యేశ్వర శర్మను సత్కరిస్తున్న ఆచార్య శ్రీపాదసుబ్రహ్మణ్యం తదితరులు

శ్రీరంగాచార్యులు గొప్ప తర్కశాస్త్ర పండితులు

రాంనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్యులు గొప్ప తర్కశాస్త్ర పండితులని ఆచార్య శ్రీపాదసుబ్రహ్మణ్యం కొనియాడారు. సోమవారం జరిగిన మరింగంటి శ్రీరంగాచార్యుల 121 స్మారక పురస్కార ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మరింగంటి శ్రీరంగాచార్య 121 స్మారక పురస్కారాన్ని డాక్టర్ లంక వెంకటసుబ్రహ్మణ్యేశ్వర శర్మకు, ఉత్తమ సంస్కృత విద్యార్థి ప్రోత్సాహక పురస్కారాన్ని నగేష్‌నాయుడుకు ప్రదానం చేశారు. ఆచార్య పెన్న మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

బోయి భీమన్న లోకం మెచ్చిన కవి



చెన్నప్పకు పురస్కారం బహూకరిస్తున్న నిత్యానందరావు, హైమావతి భీమన్న

చిక్కడపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోయి భీమన్న లోకం మెచ్చిన, మానవత్వ వాద కవి అని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. భీమన్న సాహితీ నిధి, కళానిలయం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో డా. బోయి భీమన్న 115వ జయంతి సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మసన చెన్నప్పకు భీమన్న సాహితీ పురస్కార ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య నిత్యానందరావు మాట్లాడుతూ చెన్నప్ప ఉపనిషత్‌లపై విశేష అధ్యయనం చేసి ప్రవచనకర్తగా గుర్తింపు పొందారని అభినందించారు. సాహితీనిధి స్థాపకురాలు హైమావతి భీమన్న, సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం, రచయిత డా. కోయి కోటేశ్వరరావు, కళానిలయం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలో నాణ్యతే లక్ష్యం : ఓయూ వీసీ



మాట్లాడుతున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో నాణ్యతే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కుమార్ మొలుగరం వ్యాఖ్యానించారు. ఓయూలో పరిశోధన పద్ధతులపై పదిరోజుల ఇంటెన్సివ్ వర్క్ షాప్ సోమవారం ప్రారంభమైంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజినల్ సెంటర్ సహకారంతో భూగోళశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ప్రాంతీయ పట్టణ పర్యావరణ అధ్యయన కేంద్రం (ఆర్ సీయూఈఎస్) ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన కేవలం డిగ్రీ కోసమే కాకుండా సమాజ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ఉండాలని సూచించారు. వర్క్‌షాప్‌లో కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన 30 మంది పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో తేనెతో అభిషేకం

చిక్కడపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోగల లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలోని పార్వతీక్షీరలింగేశ్వరస్వామి మందిరంలో తేనెతో అభిషేకం కార్యక్రమం కనులపండుగగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు పెంచాలని

వచ్చేనెల 10న 'హలో బీసీ చలో ఢిల్లీ'

బర్కత్‌పుర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీల విద్య, ఉద్యోగ, రిజర్వేషన్లను 25 నుంచి 50 శాతం పెంచాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 10న హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బానాల అజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి.అనంతయ్య ఆధ్వర్యంలో 9 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లకై రాజ్యాంగ సవరణ చేయాలని, క్రీమీలేయర్‌ను రద్దు చేయాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జిల నియామకాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, అజయ్‌కుమార్, నీల వెంకటేష్, అనంతయ్య తదితరులు



శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటకంలోని ఓ సన్నివేశం

రంజకంగా సాగిన 'శ్రీకృష్ణ రాయబారం'

చిక్కడపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ మిత్ర నాట్యకళా మండలి(మహబూబ్‌నగర్) ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రదర్శించిన శ్రీ కృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటక ప్రదర్శన రంజకంగా సాగింది. నటీనటులు పద్యాలను ఆలపించి శ్రోతలను ఆకట్టుకున్నారు. 1వ కృష్ణుడిగా వి. నారాయణ, 2వ కృష్ణుడిగా పాండురంగాచారి, దుర్యోధనుడిగా రాంరెడ్డి, ధృతరాష్ట్రుడిగా నర్సింహులు, ద్రోణుడిగా అశోక్‌కుమార్, కర్ణుడిగా వెంకటేష్, అశ్వత్థామగా శివాజీనాయుడు, ద్రౌపదిగా అంజలీదేవి, వికర్ణుడుగా పుండరీకతోపాటు ఇతర పాత్రల్లో నటులు నటించి నాటకాన్ని రక్తికట్టించారు. తిరుపతయ్య, హనుమంత్‌రెడ్డి, జగదీశ్ వాద్యసహకారం అందించారు.

పఠాన్‌బస్తీలో 15 రోజులుగా వెలగని విద్యుత్ దీపాలు

ముషీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పఠాన్‌బస్తీలో 15 రోజులుగా విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ డివిజన్ మైనారిటీ కమిటీ కార్యదర్శి జాఫర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ దీపాలు వెలగడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పఠాన్‌బస్తీ, సాగర్‌లాల్ ఆస్పత్రి వీధి, ఆటోస్టాండ్ వీధుల్లో వెలగని విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఇబ్రహీం, మున్నీర్, మున్నా పాల్గొన్నారు.

రైల్వే టికెట్ల బుకింగ్ విషయమై ఘర్షణ

● అయ్యప్పస్వాములు, రైల్వే ఉద్యోగిపై కేసు

బర్కత్‌పుర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైలు రిజర్వేషన్ టికెట్ల విషయమై అయ్యప్పస్వాములు టికెట్ బుకింగ్ కౌంటర్ సిబ్బందితో గొడవపడ్డారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో అయ్యప్పస్వాములు సతీష్‌కుమార్, చంద్రశేఖర్ ఉప్పుగూడ రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌కు వెళ్లారు. కౌంటర్‌లో మీరాషరీఫ్ విధులు నిర్వహిస్తున్నారు. అయ్యప్ప స్వాములు శబరిమల వెళ్లడానికి టికెట్‌లు బుక్ చేయడంతో ఆర్ఏసీ వచ్చింది. మీరాషరీఫ్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే తమకు ఆర్ఏసీ వచ్చిందని అయ్యప్పస్వాములు గొడవపడ్డారు. ఓ అయ్యప్పస్వామి గొడవను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా మీరాషరీఫ్ ఫోన్ లాక్కోవడానికి ప్రయత్నించాడు. దీంతో ఇరువురు గొడవపడి కొట్టుకున్నారు. అయ్యప్పస్వాములు, మీరాషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నత్తనడకన డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిర్మాణం

● వాహనదారుల ఇబ్బంది

రాంనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాకారం బందన్ ఫంక్షన్ హాల్ చౌరస్తాలో నత్తనడకన డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిర్మాణం, రోడ్డు పనుల్లో జాప్యం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మురుగునీరు నిల్వడంతో అందులోనుంచే వాహనదారులు ప్రయాణించాల్సి వస్తోంది. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సత్యానగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడిగా మహేందర్ ఎన్నిక



గెలుపొందిన మహేందర్ ప్యానెల్ సభ్యులు

నల్లకుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ సత్యానగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ఎన్.ఇ. మహేందర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.క్రాంతి కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.శశిధర్ విజయం సాధించారు. మరో ప్యానెల్ నుంచి కోశాధికారిగా తాలుక రవి విజయం సాధించారు. బస్తీ ప్రజలు గెలుపొందిన వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఓయూలో కొనసాగుతున్న అధ్యాపకుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీఏఎస్ ప్రమోషన్లలో జరిగిన అవకతవకలపై అధ్యాపకుల నిరసనలు 40 రోజులుగా కొనసాగుతున్నాయి. ప్రతీరోజూ మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నారు. సోమవారం ఫిజిక్స్ విభాగంలో నిరసన తెలిపారు. ప్రమోషన్ల విషయంలో "కొందరిపై ఆశ్రితపక్షపాతం, మరికొందరికి కక్ష సాధింపు" విధానాన్ని వీసీ అమలు చేశారని ఔటా నాయకులు విమర్శించారు. అడ్మినిస్ట్రేషన్ స్పందించకపోవడం, చర్చలకు పిలవకపోవడం దురదృష్టకరమని ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటదాస్, నతానియేల్, మాధురి, సుజాత, శశికళ, అపర్ణ, కామర్స్ గంగాధర్, రామచంద్రనాయక్, అరవింద్, రమేష్‌బాబు, పి.రమేష్, లోకండే సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు